


'రాజధానివార్తలు' వారపత్రిక ప్రారంభోత్సవానికి రాయపూడి గ్రామానికి విచ్చేయుచున్న అతిరధ మహారధులకు స్వాగతం సుస్వాగతం 'రాజధానివార్తలు' వారపత్రిక మేనేజ్‌మెంట్‌కు మరియు సిబ్బందికి హార్ధిక శుభాకాంక్షలు

పఠాన్ యాసిర్ ఖాన్,
రాహత్ రహ్మాన్,
రాయపూడి,
తుళ్ళూరు మండలం,గుంటూరు జిల్లా



సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

# రాజధాని వార్తలు

బాపూజీ జన్మదిన వేడుకలు
బాలల తాత బాపూజీ అక్టోబరు 2 జన్మదినాన్ని రాజధాని ప్రాంతవాసులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన కలలు గన్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఇదే రోజు లాల్‌బహదూర్ శాస్త్రి జన్మదినాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో వైభవంగా జరుపుకున్నారు.


ఆదివారం 11 అక్టోబరు, 2015 | అమరావతి. సంపుటి : 1 సంచిక 2 | www.rajadhanivartalu.com, facebook.com/rajadhaniv | పేజీలు 4 | వెల : రూ. 5.00


వివరాలు 3లో

పాఠశాలల్లో నర్సరీల పెంపకం ప్రశ్నార్థకమే!

వివరాలు 3లో
తగ్గిన రియల్ భూమ్


రాజధాని గ్రామాల చరిత్ర
వచ్చే సంచికలో
గతం

వివరాలు 3 లో
ఆమె

వివరాలు 2లో
రాజధాని కొందరికేనా..


వివరాలు 2లో
కాపాడండి సారూ
రాయపూడి ఎస్సీ కాలనీ వాసుల మొర



వివరాలు 4 లో
ఫస్ట్ ట్వంటీ 20 హోరాహోరీ


వివరాలు 4 లో
బ్రూస్‌లీ ఆడియో విడుదల

## ఊపందుకున్న అమరావతి రాజధాని

# శంకుస్థాపన పనులు

**ఏర్పాట్ల పర్యవేక్షణలో ఎంఎల్ఏలు, మంత్రులు**

**శంకుస్థాపన ప్రదేశం అన్వేషణలో సీఆర్‌డిఏ అధికారులు**




**ఆర్‌వి ప్రతినిధి,రాజధాని :**

- అమరావతి రాజధానికి శంకుస్థాపన ముహూర్తం అక్టోబర్ 22 గా ప్రభుత్వం ఖరారు చేసింది.
- స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు రాజధాని శకుస్థాపన పనుల వేగం పెంచారు.
- తుది మెరుగులు దిద్దుకుని సింగపూర్ సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉద్దండ్రాయునిపాలెం సమీపంలో ఎత్తైన రెండు టవర్లు నిర్మించే సమీపంలో శంకుస్థాపన చేయాల్సివుంటుందని చూచాయగా సమాచారం.
- సిఆర్‌డీఏ అధికారులు ఆ దిశగా శంకుస్థాపన నిర్వహించే ప్రదేశాన్ని ఆన్వేషించే 2 లో

## అమరావతి రాజధానికి

# 22న శంకుస్థాపన

**ఏపీ సిఎం చంద్రబాబు వెల్లడి**



**ఆర్‌వి ప్రతినిధి, రాజధాని :** ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నగరం అమరావతి నిర్మాణానికి ఈ నెల 22వ తేదీ దసరా పర్వదినాన మధ్యాహ్నం 12.35 నుంచి 12.45 గంటల మధ్యలో శంకుస్థాపన చేయనున్నట్టు ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. తుళ్ళూరు మండలంలోని ఉద్దండ్రాయునిపాలెం పరిసరాలలో కోర్ క్యాపిటల్ నిర్మాణం ఉంటుందని, మాస్టర్ ప్లాన్‌లో జంట టవర్‌లు నిర్మించే ప్రదేశంలో రాజధాని శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ప్రపంచ అగ్రశ్రేణి నగరంగా అమరావతి వుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్రమోడి సూచన మేరకు తాను ప్రపంచంలోని 10 ఉత్తమ నగరాలను సందర్శించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. వాటికంటే మిన్నగా అమరావతి నిర్మాణం ఉంటుందని అన్నారు. గత శుక్రవారం గుంటూరులో ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్(అప్రెడా) స్థిరాస్తి విలువ ప్రదర్శనను సీఎం ప్రారంభించారు. అనంతరం రాజధాని నిర్మాణంలో తమకూ అవకాశం కల్పించాలని అప్రెడా ప్రతినిధులు కోరగా అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. విదేశీ బిల్డర్‌లతో కలసి నిర్మాణ రంగంలో ముందుకు వెళ్లేలా చూస్తామని, భవన నిర్మాణంలో అవసరమైన ఇసుక, సిమెంట్ వంటివి కూడా సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చొరవ చూపుతుందని హామీ ఇచ్చారు. స్థానికంగా వుండే భవన నిర్మాణ కార్మికులు తమ నైపుణ్యాలను పెంపుకోవాలని కోరారు.

## 'రాజధాని వార్తలు'

# ప్రజల గుండెచప్పుడు కావాలి

- పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు
- రాయపూడిలో 'రాజధాని వార్తలు' కార్యాలయం, పత్రిక ప్రారంభం
- సమగ్ర సమాచారంతో ప్రపంచానికి వార్తలు అందించాలన్న ఎంకెఆర్
- సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, రాజకీయాల ప్రతిబింభంలా 'రాజధానివార్తలు' : నాయుడు గోపి



**ఆర్‌వి ప్రతినిధి,రాజధాని :** 'రాజధాని వార్తలు' రాజధాని ప్రజల గుండె చప్పుడు కావాలని ప్రముఖ పాత్రికేయులు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు అన్నారు. సెప్టెంబర్ 28న రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామంలో ఎంకెఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పవరపు కృష్ణారావు, ప్రముఖ సినిమా, టివి, రంగస్థల నటులు నాయుడు గోపితో కలసి ఆయన రాజధాని వార్తలు వారపత్రిక కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రముఖులు పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుర్లపాటి మాట్లాడుతూ దేశంలో విజయవంతమైన అనేక పత్రికలు తొలుత వారపత్రికలుగా, మాస పత్రికలుగా ప్రారంభమైనవేనని ఆయన గుర్తుచేశారు. చంద్రగ్రహణం దాటిన సందర్భం, పిఎస్ఎల్‌వి 30 విజయవంతంగా నింగికి ఎగసిన తరుణంలో ఎంతో గొప్ప ఆలోచనతో ప్రారంభమవుతున్న రాజధాని వార్తలు వారపత్రిక చారిత్రాత్మక రాజధానిలో సముచిత స్థానం పొందడంతో పాటు రాజధాని ప్రజల అభివృద్ధి బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా వ్యవహరించి రాజధాని నిర్మాణానికి చుక్కానిలా ఉండాలని కోరారు. ప్రపంచానికి రాజధాని గ్రామాల పరిస్థితులను, ప్రభుత్వం రాజధాని కోసం చేస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఈ ప్రాంత ప్రజలతో పాటు ప్రపంచ దేశాలలో ఉన్న తెలుగు ప్రజలకు చేరవేయాలనే సంకల్పంతో 'రాజధాని వార్తలు' పత్రికను ఏర్పాటు చేస్తున్న చీఫ్ ఎడిటర్ పఠాన్ హెచ్ ఖాన్‌ను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ గొప్ప విజయాలతో పాటు ప్రజల మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

సమగ్ర సమాచారంతోనే ముందడుగు

సమగ్రసమాచారంతోనే 'రాజధాని వార్తలు' వారపత్రిక ముందడుగు 2 లో

## రాజధానికి

# 2 జాతీయరహదారులు



**భూ సేకరణ బాద్యత రాష్ట్రానిదేనన్న కేంద్రం**

**కర్నూలు, అనంతపురంల నుంచి అమరావతి వరకు**

**ఆర్‌వి ప్రతినిధి,రాజధాని :** నవ్యాంధ్ర నూతన రాజధాని ప్రాంతంలోని గుంటూరు క్రిష్ణాజిల్లాలను కలుపుకుని సిఆర్‌డీఏ పరిధిలో గల ఔటర్‌రింగ్ రోడ్ ఓఆర్‌ఆర్ కు కేంద్రం ఆమోదం తెలిపింది.దీని వల్ల రాష్ట్రానికి చిట్టచివర వున్న శ్రీకాకుళం,రాయలసీమ జిల్లాలు అనంతపురం,కర్నూల్ కడపలనుంచి రాష్ట్ర రాజధానికి కేవలం 4 నుంచి 5 గంటలలో చేరుకోవచ్చుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది.నూతన రాష్ట్రంలో జాతీయ రహదారులకు కేందర్ం ఆమోదం తెలిపిన నేపధ్యంలో వీటిని పిపిపి పద్దతిలోనే నిర్మించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ లో వున్న రాష్ట్రస్థాయి రహదారులను జాతీయ రహదారులగా మార్చేందుకు కేంద్ర రోడ్ రవాణా మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబందించిన అధికారిక ఉత్తర్వులను కేంద్రరోడ్ రవాణాశాఖా మంత్రి నితిన్ గడ్కరి ఏపీ ప్రభుత్వానికి పంపారు.అనంతపురం మొదలుకుని కర్నూలు మీదుగా నూతన రాజధాని అమరావతికి జాతీయ రహదారిగా ప్రస్తుతం వున్న ఎన్‌హెచ్ 44 ను 452 కిమీ పొడవున ఎన్‌హెచ్ 65లో కలపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కర్నూలు, కడప, అనంతపురం ఎన్‌హెచ్ 40 ని 132 కిమీ వరకు గల రహదారిని ఎన్‌హెచ్ 65 లో కలుపుతారు. ఈ రహదారుల నిర్మాణానికి రూ1000 కోట్ల ప్రాజెక్టు పెట్టుబడిగా కేంద్రం అంచనా వేసినట్లు సమాచారం.అలాగే ప్రస్తుతం వున్న నాలుగు లైన్ల రోడ్‌ను 6 లేదా 8 లైన్ల రోడ్‌గా నిర్మించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.ఐతే భూ సేకరణ భాద్యత రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే వుందని,భూసేకరణ చేసి కేంద్రానికి అప్పగిస్తే త్వరిత గతిన ఎన్‌హెచ్ ఏఐ నిర్మాణ పనులు చేపడుతుందని పేర్కొంది. అలాగే ఎన్‌హెచ్ ఏఐ బడ్జట్ల లో ఈ ప్రాజెక్టు కు నిధులు కేటాయింపు వుంటుందని కేంద్రం తెలిపింది.జాతీయ రహదారులకు సంబందించిన అన్నీరకాల అనుమతులకై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కోసం కేంద్రరోడ్ రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరి ఎదురు చూస్తున్నట్లు తెలియవచ్చింది.

## అతిరథ మహారథులకు రాజధాని వార్తలు నమస్సుమాంజలి

రాజధాని వార్తా పత్రికను అమృత హస్తాలతో ప్రారంభించిన మహోన్నతుడు, అక్షర భీష్ముడు పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావుకు కార్యక్రమంలో పాల్గొన్న సినీ, రంగస్థల నటులు గుమ్మడి నాగేశ్వరరావు, విజయకళ ఎడిటర్ మహ్మద్‌రఫీ, సినీ, టీవీరంగ స్థలనటులు, దర్శకులు నాయుడు గోపి, ఎంకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముప్ప వరపు కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు ఆంధ్రజనతా సంపాదకులు కె. పాండు రంగారావు, మా ఆహ్వానాన్ని మన్నించి రాయపూడి పరిసరప్రాంతాల నుంచి విచ్చేసిన ఉత్తమాభిరుచి గల పాఠకులకు మా నమస్సుమాంజలి. బాలారిష్టాలను అతిత్వరలో అధిగ మించి నాణ్యతగల పత్రికను మీ అభిరుచులకు అనుగుణంగా రూపొందించి, మేలైన పత్రికను రాజధాని ప్రాంత ప్రజలకు అందిస్తాం. అందులో భాగంగా అత్యుత్తమ శీర్షికలను ప్రవేశపెట్టి అక్షర సంపదను మీముందుకు తేవడానికి కృషి చేస్తున్నాం. మీ సద్విమర్శలను సూచనలను సలహాలను స్వీకరించడానికి రాజధాని వార్తలు సదా సిద్ధం. మీ ఆశీస్సులే మాకు శిరోధార్యం...



మీ
ఎడిటర్- ఇన్ - చీఫ్

## రాజధాని ప్రాంతం... ప్రజలకు నిత్యం నరకం



**ఆర్‌వి ప్రతినిధి,రాజధాని :** సాదాసీదాగా ఉండే పల్లె ప్రాంతం ఒక్కసారే రాజధాని ప్రాంతంగా మారిపోవడంతో కిలాకిలా రావాలతో ప్రతిధ్వనించే పల్లెల్లోని రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రజలు బయటకు వెళ్లాలన్నా, బయటి ప్రజలు రాజధాని ప్రాంతానికి రావాలన్నా ఒకటే ట్రాఫిక్ జాం ...చిన్న చిన్న సందుల నుండి బస్సులు తిరగటమే కష్టం అనుకుంటే అధికారుల వాహనాలు, రోడ్లు వేసే నెపంతో లారీలు, పొక్లయినర్లు వల్ల గ్రామాల నుండి విజయవాడ, గుంటూరు వెళ్లి చదువుకొనే లేదా ఉద్యోగాలు చేసుకునే వారికి నిత్యం నరక వేదనకు గురి చేస్తున్నాయి. అమరావతి నుండి విజయవాడ వరకు ఒక్క రోడ్డు కూడా బాగోలేదు. అన్నీ గుంతల మయమే...మంగళగిరి నుండి ఎర్రబాలెం, తుళ్లూరు మీదుగా వెళ్లే రోడ్డు కూడా అధ్యానంగానే ఉంది. కనీసం మంచి రోడ్లు కూడా వేయకుండా కార్యాలయాలు తెరిచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ రోడ్ల మీద ట్రాఫిక్ నియంత్రించడానికి ఒక్క పోలీసు కూడా ఉండరు...రోడ్డు మార్జిన్ దిగితే వాహనం పల్టీ కొట్టడం మామూలే... వ్యాధిబారిన పడినవాళ్లు...గర్భిణులు... ప్రమాదానికి లోనైన వాళ్లు ఆసుపత్రికి వెళ్లవల సివస్తే...ఊహించడానికే భయంగా ఉంటే ..ప్రతిక్షణం అనుభవించే ఇక్కడి ప్రజల మాటేమిటి ?

# మందడం వినాయకుని లడ్డు ధర రూ 6లక్షల16 వేల 116

- **వేలంలో దక్కించుకున్న జెడ్‌పిటిసి నరేంద్రబాబు**



**ఆర్‌వి ప్రతినిధి, రాజధాని :** రాజధాని ప్రాంతంలోని మందడం గచ్చు సెంటర్‌లో అక్టోబర్ 1 వ తేదీని గణేష్‌నిమజ్జనం జరిగింది.ఈసందర్భంగా సుమారు 32 కేజీల గణేష్‌లడ్డు ను భక్తులు వేలం నిర్వహించారు.కాగా నిర్వాహకులు నిర్వహిలంచిన లడ్డు వేలంలో తుళ్ళూరు జెడ్‌పిటిసి బెజవాడనరేంద్రబాబు రూ 6లక్షల16 వేల 116 కు దక్కిం చుకున్నారు.అనంతరం లూడ్డూ ప్రసాదాన్ని గ్రామంలో పంపిణి చేశారు. అనంతరం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు కన్నుల పండువగా నిర్వహించారు.



# ప్రజల గుండె చప్పుడు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

వేయాలని ఎంకెఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పవరపు కృష్ణారావు కోరారు. గత నెల 28వ తేదీన రాజధాని ప్రాంతంలో ప్రారంభించిన 'రాజధాని వార్తలు' వార పత్రికసభలో ఆయన మాట్లాడారు. కొన్ని పత్రికలు విలువలు మరచి ఎల్లో జర్నలిజంలో పోటీ పడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి ఎన్నో సవాళ్ళ మధ్య తొలిసారిగా రాజధాని ప్రాంతంలో ఉదయిస్తున్న వారపత్రిక రాజధాని వార్తలు విజయవంతంగా ముందుకు పోవాలని ఆయన కోరారు. మంచిని మంచిగా, చెడును చెడుగా చూపాలని, బ్లాక్‌మెయిల్, బెదిరింపు లుతో పత్రికలు ముందుకు సాగలేవని ఆయన హితవు పలికారు. ప్రజా విశ్వాసం పొందిన పత్రికలు మాత్రమే సమాజంలో మనగలు గుతాయని సూచించారు. సామాజిక స్పృహ, బాధ్యతతో పఠాన్ హెచ్ ఖాన్ నిర్మించిన 'పత్రిక రాజధాని వార్తలు'కు తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయాల ప్రతిబింభంలా 'రాజధాని వార్తలు' సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయాల ప్రతిబింభంలా 'రాజధాని వార్తలు' వార పత్రిక

ఉండాలని ప్రముఖ సినీ, టివి,రంగస్థల కళాకారులు నాయుడు గోపి అన్నారు. రాజధాని వచ్చిన తర్వాత పల్లెప్రజల జీవితాలలో ఒక్కసారిగా వస్తున్న మార్పులు, వారు ఎదుర్కుంటున్న సమస్యలు, కోల్పోతున్న సాంస్కృతిక వైభవాలను రాజధాని వారపత్రికలో ప్రజలు, పాఠకులు తెలుసుకోవాలన్నారు. ప్రజలకున్న ప్రత్యక్ష ఆయుధం పత్రికలని, అవి విలువలు పాటించి వారి పక్షం వహించాలని కోరారు. ఎంతో ఉన్నత ఆశయంతో చిన్న నాటి స్నేహితులు పఠాన్ హుస్సేన్‌ఖాన్, మధులు పత్రికను స్థాపించి ప్రపంచంలోని తెలుగు వారికి రాజధాని వార్తలు అందిం చాలని సంకల్పిం చడం అభినందనీ యమ న్నారు. జర్నలిస్ట్ హోదాలో పద్మశ్రీ అవార్డు పొందిన సీనియర్ జర్నలిస్ట్ తుర్లపాటి కుటుంబరావు చేతుల మీదుగా సంస్థను ప్రారంభించుకోవడం, స్థానిక జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్‌ను సన్మానించుకోవడం వారి వృత్తిపట్ల గౌరవాన్ని సూచిస్తోందని, ఇలాగే పది కాలాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



రాజధాని ప్రజలపై మక్కువతోనే పత్రిక ఆవిష్కరణ :

ప్రముఖ పాత్రికేయులు, 'విజయకళ మాసపత్రిక' అధినేత మహమ్మద్ రఫి మాట్లాడుతూ చిన్న పత్రికలకు మనుగడ కష్టతరమైన రోజుల్లో కేవలం రాజధాని ప్రజల కోసం పత్రికా సంపాదకీయంలోకి అడుగు పెట్టడం ఈ ప్రాంత ప్రజలపై నిర్వాహకులకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. అందరూ సహకరించి సొంత పత్రికలా ఆదరించి ముందుకు నడిపిస్తే రానున్న రోజుల్లో అందరికీ రాజధాని వార్తలు అండగా ఉండగలదని అన్నారు. సంపాదనే ధ్యేయంగా పత్రికలు ఉద్భవిస్తున్న రోజుల్లో ప్రపంచ తెలుగు ప్రజలకు రాజధాని వార్తలు చేరవేసే వారధి కోసం పత్రికను ఆవిష్కరించిన ఘనత రాజధాని వార్తల మేనేజ్‌మెంట్‌కే దక్కిందని ప్రశంశించారు.

పొంగిపోవద్దు, కుంగిపోవద్దు : గుమ్మడి నాగేశ్వరరావు

పెనుసవాళ్ళతో కూడిన పత్రికా రంగంలో అనేక ప్రశంసలు, విమర్శలూ ఉంటాయని, వీటన్నింటిని సమన్వయం చేసుకుని దేనికీ పొంగి పోకుండా, కుంగిపోకుండా ముందుకు వెళ్ళాలని ప్రముఖ సినీ, రంగస్థల కళాకారులు సీనినటులు గుమ్మడి వెంకటేశ్వరావు కుమారులు గుమ్మడి నాగేశ్వరరావు అన్నారు. జాతీయ పత్రికల స్థాయికి తీసిపోకుండా రంగుల్లో తయారైన పత్రిక 'రాజధాని వార్తలు' అని, ఇది తప్పక జనాదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ సిబ్బంది మరింత సృజనాత్మకతతో పనిచేసి పత్రికను ప్రజలలోకి తీసుకు వెళ్ళాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కె.పాండురంగారావు, సిఆర్‌డీఏ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు కాటా చంద్రశేఖర్, అధ్యాపకులు అయూబ్‌ఖాన్ తదితరులు ప్రసంగించారు.

జర్నలిజానికి వన్నె తెచ్చిన తుర్లపాటి : పిహెచ్ ఖాన్

అనంతరం పత్రిక చీఫ్ ఎడిటర్ పఠాన్ హుస్సేన్‌ఖాన్, మేనేజింగ్ ఎడిటర్ ఎం.మధు ముఖ్యఅతిథి తుర్లపాటి కుటుంబరావును ఘనంగా సత్కరించారు. అతిథులు ముప్పవరపు కృష్ణారావు, నాయుడుగోపి, గుమ్మడి నాగేశ్వర రావు, కె.పాండురవగారావు, మహమ్మద్ రఫీలకు



జ్ఞాపికలను బహుకరిం చారు. నూతనంగా సిఆర్‌డీఏ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు కాటా చంద్రశేఖర్‌కు రాజధాని వార్తలు మేనేజ్‌మెంట్ ఈ సందర్భంగా గౌరవ సత్కారం నిర్వహిం చారు. అనంతరం రాజధాని వార్తలు పత్రిక చీఫ్ ఎడిటర్ పఠాన్‌హుస్సేన్‌ఖాన్ మాట్లాడుతూ 14వ ఏటే పత్రికల్లో వ్యాసాలు రాసి స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి జర్నలిజంలో విశేష అనుభవం గడించిన పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావును ఈ సందర్భంగా సన్మానించు కోవడం తమ అదృష్టమని అన్నారు.

రాజధాని వార్తలు వారపత్రికకు టిడిపి, వామపక్షాల అభినందనలు :

రాజధాని వార్తలు వారపత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా సిపిఎం సిఆర్‌డీఏ, రాజధాని కమిటీ కన్వీనర్ సీహెచ్ బాబూరావు, రాజధాని డివిజన్ కమిటీ కన్వీనర్ ఎం.రవి, సిపిఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మురళీలు రాజధాని వార్తల మేనేజ్ మెంట్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే క్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొమ్మినేని సత్యన్నారాయణ, జన్నలగడ్డ కిరణ్‌కుమార్, బండ్ల పట్టాభిరామయ్య, హరికృష్ణ, జమ్ముల అనీల్ తదితరులు రాజధాని వార్తల మేనేజ్‌మెంట్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వామపక్ష నేతలు సీహెచ్.బాబూరావు, ఎం.రవి, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మురళి తదితరులు మాట్లాడుతూ ప్రజల పక్షం వహిస్తూ, ప్రజావాణి వినిపిస్తూ పత్రిక విలవలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఎడిటోరియల్

# చరిత్ర పునరావృతం కారాదు...

పచ్చని పైరులతో అలరారే ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాజధానిగా ప్రకటించింది. దాంతో పల్లెజనం ఉద్వేగానికి గురయ్యారు. తమ భావిజీవితం ఎలా? అని ప్రభుత్వ ప్రకటించిన 33 వేల ఎకరాల రాజధాని ప్రాంతంలో సగానికి పైగా భూములు అప్పటికే పెద్దల కైంకర్యం అయ్యాయి. దీంతో నిజమైన రైతులు అభివృద్ధి చెందే రాజధాని ఫలాలను అందుకునే వీలు లేకుండా పోయింది. రైతు కూలీల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. సింగపూర్ సౌజన్యంతో రాజధాని 'అమరావతి'ని అభివృద్ధి చేస్తామని, చంద్రబాబు ప్రకటించారు. ఆదేశంతో మనరాష్ట్రం చేసుకున్న నియమ నిబంధనలేవీ ఇక్కడి ప్రజలకు తెలియదు. ప్రభుత్వానికి, ప్రజలకు – ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజలకు మధ్య అగాధం. వాటిని ఎప్పటికి సరిదిద్దుతారో తెలియదు. అంతకుముందు కాకినాడలోని ఏటిమొగ్గ గ్యాస్ క్షేత్రాన్ని ప్రభుత్వం రిలయన్స్ సంస్థకు అప్పగించినప్పుడు ఈ రాష్ట్ర అవసరాలు తీర్చిన తరువాతే దేశంలోని మిగతా ప్రాంతాలకు గ్యాస్ పంపుతామని, రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలకు గ్యాస్ ఆధారిత విద్యుత్‌ను అందచేస్తామని, రోడ్లు వేస్తామని ఒప్పందానికి ముందు అరిచేతిలో వైకుంఠం చూపింది. కాని ఒక్కటంటే ఒక్కటి కూడా పరిశ్రమ రూపుదిద్దుకోలేదు, కోస్తా ప్రాంత వాసులకు కనీసం ఒక్క బల్బు కూడా గ్యాస్‌తో వెలగలేదు. దీంతో తాము దారుణంగా మోసపోయామని తెలుసుకున్నారు. కాకినాడ నుండి గుజరాత్‌కు గ్యాస్ తరలిస్తున్న నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల మధ్య ఉన్న రాష్ట్రాలు గ్యాస్‌పైపులు తమ భూభాగం నుండి వెళుతున్నందుకు రిలయన్స్ సంస్థ నుండి భారీగా రాయల్టీని వసూలు చేశాయి. కాని అవిభక్త ఆంధ్రప్రదేశ్ ఘోరంగా నష్టపోయింది. రిలయన్స్ ఒక్క గ్రామాన్ని దత్తత తీసుకోవడంగాని, రోడ్లు వేయడం లాంటి చిన్న చిన్న పనులు కూడా చేయలేదు. ఈ క్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని 250 గ్రామాల దత్తత కోసం రతన్ టాటాని రాష్ట్రానికి తీసుకువచ్చారు. నిజానికి గ్యాస్ నిక్షేపాలను ఓఎన్‌జీసీకి అప్పచెప్పి ఉన్నా..రాష్ట్రమే దాన్ని సొంతం చేసుకున్నా ఉత్తరాంధ్రలో, విజయవాడ, రాయలసీమలో మూడు రాజధానులు కట్టుకునే వాళ్లం ... ఈ విషయంపై వామపక్ష పార్టీలు కూడా మాట్లాడటం లేదు. చంద్రబాబు అనుకున్నదే చేస్తారు ...సందేహం లేదు...అయితే ప్రజలు కలకాలం గుర్తుంచుకునేలా సమగ్రమైన, వ్యవస్థాగతమైన అభివృద్ధిని రాష్ట్ర ప్రజలకు అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు పారదర్శకతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనించాలి. తదనుగుణంగా కార్యాచరణ ప్రకటించాలి. ఆంధ్రులకు 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' లా అన్నీ కోల్పోతుంటారు. ఇకనైనా ముందే మేల్కొని రాష్ట్ర వాసులకు న్యాయం చేకూర్చాలి. మనకున్న వనరులను వ్యక్తులకు కాకుండా వ్యవస్థ అభివృద్ధి చెందేలా ఉపయోగించాలి. రానున్న తరాలకు మంచి భవిష్యత్ అందించేందుకు కృషి చేయాలి, రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌పై భరోసా కల్పించి, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువ చేయాలి. అంతేకాదు ఆహార భద్రతకు తగు ప్రాధాన్యత కల్పించాలి. ఎన్ని పరిశ్రమలు ఏర్పాటయినా, బహుళ అంతస్తులు పేరు ప్రఖ్యాతులు తేగలవేమో గానీ కడుపు నింపవనే వాస్తవాన్ని ప్రజలు, పాలకులు గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలి. పరాయి సంస్థలను ఆహ్వానించే ముందు సమగ్ర చర్చలు చేపట్టటం ఎంతైనా అవసరం. భూములివ్వని రైతులకు రాబోయే రోజుల్లో వాటిలో పంటలు వేసుకునే అవకాశం ఉండదని, అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వదని, ఎటువంటి అభివృద్ధికి నోచుకోమనే అపోహాలను ఈ ప్రాంత రైతుల నుండి తొలగించేందుకు గట్టిగా ప్రయత్నించాలి.


# రాజధాని కొందరికేనా..?

- ♦ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రజాసంఘాలు
- ♦ సమస్య పరిష్కరించమంటే గొంతు నులుముతారా?
- ♦ సీఎంను ప్రశ్నించిన ప్రముఖ న్యాయవాది
- ♦ ప్రజాసంఘాల ఉద్యమాల అణచివేత అమానుషమంటున్న సిపిఎం,ఎంఆర్‌పిఎస్

**ఆర్‌వి ప్రతినిధి, రాజధాని :** తుళ్లూరు కన్యకాపరమేశ్వరి సత్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం వాడీవేడిగా సాగింది. రాజధాని నిర్మాణంలో భాగంగా సిఆర్‌డీఏ అధికారులు, ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై పలువురు ప్రజాసంఘాల నేతలు సుదీర్ఘంగా చర్చ చర్చించారు. ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు,(వైకె) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాలతో పాటు పలు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాది వైకె మాట్లాడుతూ రాజధాని ప్రకటన అనంతరం ఈ ప్రాంతంలోని ప్రజలు అనేక ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తోందన్నారు. వారి సమస్యలు పరిష్కారానికి ప్రజాసంఘాల మద్దతుతో నిరసనలు, ఉద్యమాలు చేయడం అనివార్యమని తెలిపారు.వాటిని అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన పాలకులు ప్రజలు, ప్రజాసంఘాల గొంతు నులమాలని చూడటం, ఆందోళనలను అణచివేసి అక్రమ అరెస్టులు చేయడం దారుణమన్నారు. వారిపై రాజధానికి వ్యతిరేకులనే ముద్ర వేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నట్టు కనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉందని చెబుతూనే ప్రచారాల కోసం, ఆర్భాటాల కోసం వందల కోట్లు ఖర్చుచేస్తోందని విమర్శించారు. ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందా కృష్ణమాదిగ , సీపీఎం నాయకుల దీక్షలను భగ్నంచేసి ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురి చేసిందని అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కమిటి కార్యదర్శి ఎం రవి.మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చమని మాత్రమే బాధితులు ఆందోళనలు చేశారని, అనేక పోరాటాల అనంతనం అసైన్డ్, సీలింగ్ భూముల లబ్ధిదారుల సమస్యలు ఓ కొలిక్కి వచ్చినట్లుగా ఉందన్నారు. అసత్యాలతో అధికారులు సమస్యలు పరిష్కరించకుండా మభ్యపెడుతూ వచ్చారని, దీనివల్లే ఆందోళనలు ఉధృతమయ్యాయని తెలిపారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు మల్లవరపు నాగయ్య మాదిగ మాట్లాడుతూ రాజధానిలో దళితులకు, పేదలకు అన్యాయం జరిగితే ఎంఆర్‌పిఎస్ ప్రతిఘటిస్తుందని, ప్రభుత్వంపై ఉలాంటి పోరాటానికైనా సిద్ధపడుతుందని అన్నారు. అనంతరం రాజధాని ప్రజలకు సీఎం ఇచ్చిన హామీలన్నీ సత్వరం నెరవేర్చాలని, ప్రజాసంఘాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ఉద్యమించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నవీన్ ప్రకాష్, పలువురు గ్రామస్థులు పాల్గని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

## మురుగు నుంచి


# కాపాడండి సారూ...






### రాయపూడి ఎస్సీ కాలనీ వాసులు మొర

**ఆర్‌వి ప్రతినిధి, రాజధాని :** డెంగ్యూ జ్వరాలతో వణికిపోతున్నాం.. మమ్మల్ని మురుగు నుంచి కాపాడండి సారూ...అంటూ రాయపూడి ఎస్సీ కాలనీ వాసులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా. ఏమాత్రం వర్షం పడినా కాలనీ మురుగుతో నిండిపోవడంతో బయటికి వెళ్ళే అవకాశం లేక నానా పాట్లు పడుతున్నామని వాపోతున్నారు. పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో రోగాల భారిన పడుతున్నామన్నారు. పాములు, తేళ్ళు, మండ్రగప్పలు ఇళ్లలోకి వస్తున్నాయని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. నిత్యం అనేకమంది అంటురోగాలు, తీవ్ర జ్వరాల భారిన పడి అకాల మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దుర్గంధం, కలుషిత నీరు, ఖాళీ ప్లాటుల్లో పిచ్చిమొక్కలు కాలనీ వాసులకు శాపంగా మారాయని, పంచాయితీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాజధాని ప్రాంతంలో ఉన్నందున తమ కాలనీని అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు.









# శంకుస్థాపన పనులు

(మొదటి పేజీ తరువాయి)

పనిలో నిమగ్నమయ్యారు.

- ❖ రాజధాని శంకుస్థాపనలో ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వుండేలా చర్యలు తీసుకోవాలని తగిన సిబ్బందితో అన్నీ హంగులను ఏర్పాటు చేసే పనిలో ఎంఎల్‌ఏలు మంత్రులు వున్నారు.
- ❖ వారి పర్యవేక్షణలో రాజధాని శంకుస్థాపన పనులు జరుగుతున్నాయి.
- ❖ సీఆర్‌డిఏ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో పాటు ప్రభుత్వంలోని అన్నీ శాఖల కు ఈ బృహత్తర కార్యక్రమ బాద్యతలను ప్రభుత్వం అప్పగించింది.
- ❖ ఇదే క్రమంలో నూతన రాజధాని లోని 13 జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా ఏర్పాట్లను చేస్తున్నారు.
- ❖ తగిన పోలీస్ సిబ్బందితో పాటు స్థానిక యువకులకూ ట్రాఫిక్ నియంత్రణ,శాంతి భద్రతల పరిరక్షణ భాద్యతలను అప్పగించాలని పోలీస్ శాఖ భావిస్తుంది.
- ❖ ఈమేరకు యువకులు శిక్షణ ఇచ్చే పనిలో జిల్లా పోలీస్ యంత్రాంగముంది.
- ❖ సుమారు 165 ఎకరాల స్థలంలో సభావేదిక ఇతర సౌకర్యాలను ,శంకుస్థాపన ప్రదేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- ❖ స్వచ్ఛభారత్,పచ్చదనం పరిశుభ్రత,లక్షలాది మంది విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాలను సీఎం నిర్వహించనున్నట్లు సమాచారం
- ❖ శంకుస్థాపన ప్రదేశానికి రవాణా సౌకర్యాలు కృలించడంతో పాటు వాహనాలకు పార్కింగ్ తాగునీరు,ఆహారం,వైద్యం,ఏర్పాటు చేయాలని ఆధికారులు భావిస్తున్నారు.
- ❖ వీటికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.
- ❖ రాజధాని శంకుస్థాపన కార్యక్రమానికి ఆటం కలిగించే ఎలాంటి చర్యలకూ అనుమతులు ఇవ్వబోమని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- ❖ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ శాఖ హెచ్చరిక జారీ చేసింది.
- ❖ రాజధాని శంకుస్థాపనకు ఎంతమంది వచ్చిన ఎటువంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు తాడికొండ ఎమ్మెల్యే టి శ్రావణకుమార్ తెలిపారు.



# పాఠశాలల్లో నర్సరీల పెంపకం ప్రశ్నార్థకమే!

- ఒక్కో పాఠశాలలో 30 వేల మొక్కల పెంచాలని ప్రభుత్వ నిర్ణయం
- అరకొర వసతులతో వున్న పాఠశాలల్లో మొక్కలు పెంచడం అసాధ్యమంటున్న పాఠశాలల సిబ్బంది
- అనుకూల పాఠశాలల కోసం జల్లెడ పడుతున్న అటవీశాఖ అధికారులు
- తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లో పాఠశాల నర్సరీల ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు





**ఆర్‌వి ప్రతినిధి, రాజధాని :** నవ్యాంధ్ర నూతన రాజధాని పచ్చదనం పర్యావరణంతో ఉండాలని సీఎం చంద్రబాబు సంకల్పం. దీనిలో భాగంగా ఇప్పటికే సామాజిక, అటవీశాఖలకు సుమారు 350 ఎకరాల భూములను రాజధాని ఆ ప్రాంతంలోని పలు గ్రామాలలో అప్పగించి వాటిలో పచ్చదనం పెంపొదించడంతో పాటు నర్సరీలు పెంచి వ్యవసాయ కూలీలకు ఉపాధి కలించేలా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో మరో కొత్త పథకానికి ప్రభుత్వం తెరతీసింది. పాఠశాలలో కూడా నర్సరీలు పెంచి వాటికి ఓ సేవకుడిని ఏర్పాటు చేసి మొక్కలకు, పాఠశాలకు, విద్యార్థులకు సేవలు అందించేలా పథ కాన్ని రూపకల్పన చేసింది ప్రభుత్వం. ముందుగా పైలెట్ ప్రాజెక్టుగా ఈ పథకాన్ని రాజధాని ప్రాంతంలోని, తుళ్ళూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లో అమలు చేయాలని ప్రభుత్వం అటవీశాఖ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు నర్సరీలు పెంచేందుకు అనుకూలమైన పాఠశాలల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో 20 నుంచి 30 వేల మొక్కలు పెంచే పరిస్థితులు లేక పోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

ఇదిలా వుండగా అరకొర వసతులతో ఉన్న పాఠశాలలో వేలాది మొక్కలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వాటి పరిరక్షణ బాధ్యతలు తలుచుకుని అటవీశాఖ అధికారులతో పాటు, పాఠశాల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ప్రహరీ గోడలు దూకి వెళ్ళి పాఠశాలలను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకుని వాడుకుంటున్న పరిస్థితి ఓ వైపు, కోతుల బెడద మరో వైపు ఇబ్బందులకు గురి చేస్తుంటే వేలాది మొక్కలను ఎలా పరిరక్షించగలమని పాఠశాల సిబ్బంది వాపోతున్నారు. ఒక్క పాఠశాలలో కూడా సరైన ఆట స్థలం లేదు, ఉన్నా అది సంవత్సరంలో ఆరు నెలలు వర్షం నీటితో మురుగు కూపంలా వుంటుంది. ఇలాంటి పరిస్థితులలో వేలాది మొక్కలతో నర్సరీలను పాఠశాలలో ఏర్పాటు చేస్తే లాభాలకంటే జరిగే నష్టాలు ఎక్కువగా ఉంటాయని పాఠశాల సిబ్బంది అంటున్నారు. వారి మాటల్లోనే...

### చెరువులలో నిర్మించిన పాఠశాలలు కావడమే సమస్య



మొక్కలు పెంచుకోవాలని, పాఠశాలలు అందంగా వుండాలని కోరుకుంటాం. ఐతే పూర్వం దాతలు పాఠశాలలను చెరువు ప్రాంతాలలో నిర్మించడం వల్ల అవి ఇలాంటి మంచి కార్యక్రమాలకు అనుకూలంగా లేకుండా పోతోంది. స్థలం ఉన్నా ఫెన్సింగ్ లేదు, బోరు నీరు లేదు. వర్షం వస్తే మెక్కలు నీటిలో వుండిపోతాయి. చక్కటి సౌకర్యాలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతామంటే తమ వంతు సహకారం తప్పక వుంటుంది.

**రాంబాబు, హెచ్ఎం, ఐనవోలు జెడ్‌పిహెచ్ఎస్**

### ప్రభుత్వమే రక్షణ చర్యలు చేపట్టాలి



పాఠశాలలో మొక్కలు పెంపకం ఆహ్వానించదగిన పరిణామం. మొక్కలు పెంచేందు అనువైన మైదానాన్ని, ఫెన్సింగ్, విద్యుత్, నీరు వంటి వసతులతో పాటు మొక్కల రక్షణ బాధ్యతలను ప్రభుత్వం తీసుకుంటేనే పాఠశాలల నర్సరీలు అభివృద్ధి సాధ్యపడుతుంది. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న మైదానాలు ఏ మాత్రం మొక్కల పెంపకానికి అనుకూలంగా లేవనే చెప్పాలి. సౌకర్యాలూ అంతంత మాత్రంగానే వున్నాయి. వీటిని పరిశీలించి అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పాఠశాల సిబ్బంది సహకరిస్తారు.

**మోహనరావు, హెచ్ఎం. కెవిఆర్‌జెడ్‌పిహెచ్ఎస్, తుళ్ళూరు**

# కౌలు చెక్కుల దీక్షలు విజయవంతం

## సీపిఎం నేతలు , లబ్ధిదారుల హర్షం

**ఆర్‌వి,రాజధాని ప్రతినిధి :** గత మూడు నెలలుగా అసైన్డ్ సీలింగ్ లబ్ధిదారులు ప్రభుత్వానికి ల్యాండ్‌పూలింగ్‌లో తమ భూములు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే కౌలు చెక్కులు రైతులతో పాటు అసైన్డ్ సీలింగ్ లబ్ధిదారులకు సిఆర్‌డీఏ అధికారులు అందజేస్తారని అంతా భావించారు. సాంకేతిక కారణాలు చెబుతూ కొన్ని రోజులు, లబ్ధిదారుల లెక్కలు తేలలేదంటూ మరికొన్ని రోజులు అధికారులు కౌలు చెక్కులు పంపిణీలో జాప్యం చేశారు. దీంతో లబ్ధిదారులు అనేక ఆందోళనలు చేశారు. ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. 144 సెక్షన్ పెట్టి పోలీసులు సీపీఎం దీక్షలను భగ్నం చేశారు. ఐతే 144 సెక్షన్ ఎత్తి వేసిన అనంతరం తిరిగి సీపీఎం మద్దతుతో లబ్ధిదారులు చేసిన ఆందోళనలు ఫలించి ఎట్టకేలకు సిఆర్‌డీఏ అధికారులు కౌలు చెక్కులు అసైన్డ్ సీలింగ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో సుమారు 80 మంది సీలింగ్ లబ్ధిదారులతో పాటు 400 మంది అస్సైన్డ్ భూముల లబ్ధిదారులకు కౌలు చెక్కులు అందజేసినట్లు అధికారులు తెలియజేశారు. దీంతో సీపీఎం నాయకులు లబ్ధిదారులు హర్షం ప్రకటించారు.




# సూపర్‌మూన్



## ఎరుపెక్కిన చంద్రుడి అరుదైన దృశ్యం

**ఆర్‌వి, రాజధాని ప్రతినిధి :** సూపర్‌మూన్ చంద్రగ్రహణం, హార్వెస్ట్‌మూన్ ఎక్లిప్స్, సూపర్ బ్లెడ్‌మూన్ ఈ పేర్లన్నీ సెప్టెంబర్ 28వ తేదీన ఏర్పడిన చంద్రగ్రహణానికి నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) పెట్టిన పేర్లు. సాధారణంగా చంద్రుడు సూర్యుడి మధ్య భూమి వచ్చినపుడు చంద్రగ్రహణం ఏర్పడుతుందని, ఈ సారి మాత్రం చంద్రుడు దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రయాణించినపుడు చంద్రగగ్రహణం ఏర్పడిందని పరిశోధకులు చెబుతున్నారు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపించడం విశేషమని తెలిపారు. చంద్రుడిని భూ మండలం నుంచి చూస్తే 14 శాతం పెరిగిన వ్యాసంలో కనిపిస్తాడని వివరించారు. 1900వ సంవత్సరం నుంచి సూపర్‌మూన్ దృశ్యాలు 5 సార్లు మాత్రమే కనిపించినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇలాంటి అరుదైన దృశ్యాలు చూసేందుకు ప్రపంచ దేశాలలోని ప్రజలు ఎంతో ఆసక్తిని కనబరిచారు. ఎరుపెక్కిన చంద్రుడిని తమ కెమేరాలలో బంధించారు. ఇదిలా వుండగా, సూపర్‌మూన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలమవుతుందని సముద్ర పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రపంచ దేశాలు ప్రధానంగా సముద్రతీర దేశాలు అప్రమత్తమయ్యాయి. ఎక్కడా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకపోవడంతో సూపర్‌మూన్ చూసిన అనుభూతులను ఖగోళ ప్రేమికులు పదిలపరుచుకున్నారు.

# రాజధానిలో తగ్గిన రియల్ భూమ్

- సీడ్ క్యాపిటల్ శంకుస్థాపన అనంతరం భూముల ధరలు పెరగవచ్చని అంచనా
- ఊపందుకున్న లంక భూములు, అస్సైన్డ్ భూముల కొనుగోళ్ళు

**ఆర్‌వి రాజధాని-తుళ్ళూరు :** నవ్యాంధ్ర రాజధానిగా తుళ్ళూరును ప్రతిపాదించిన అనంతరం మండల ప్రజల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అమాంతంగా కోట్లకు చేరిన భూముల ధరలతో చిన్న, సన్నకారు రైతులు సైతం తమ జీవితాలు బాగుపడ్డాయని, అరెకరం భూమి అమ్ముకున్నా తమ బిడ్డల తరాలూ వెళ్ళిపోతాయని సంబరాలు చేసుకుంటున్నారు. ఐతే ఆరంభం నుంచే అనేక అనుమానాలు, భయాలతో సాగుతున్న భూ వ్యాపారం ప్రస్తుతం మందకొడిగా సాగుతుందని రైతులు వ్యాపారులు అంటున్నారు. ఎకరం భూమి ధర రూ.2 కోట్లకు చేరుకుంటుందని ఆశించినా రూ కోటీ 70 లక్షలలోపే ధరలు నిలిచిపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఈ నెలలో మెట్ట భూముల ధరలు రూ. కోటి 50 నుంచి రూ 1.70 కోట్లు ధర పలుకగా మాగాణి భూముల ధరలు సుమారుగా రూ 2 కోట్ల వరకు చేరింది. ఐతే కొనుగోళ్ళు పెద్దగా జరగలేదని రైతులు అంటున్నారు.

### సీడ్‌క్యాపిటల్ శంకుస్థాపన పైనే ఆశలు

అక్టోబర్ 22 న సీఎం చంద్రబాబు నాయుడు భారత్, సింగపూర్, జపాన్ ప్రధానులతో కలిసి సీడ్ క్యాపిటల్‌కు శంకుస్థాపన చేయనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శంకుస్థాపన అనంతరం భూములకు మంచి గిరాకీ వస్తుందని సుమారు రూ 5 కోట్ల వరకు భూములకు ధరలు వస్తాయని రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. అదే జరిగితే చంద్రబాబును నమ్మి భూములు ఇచ్చినందుకు ఆయన ఈ ప్రాంతానికి చేసిన గొప్ప మేలు అవుతుందని రైతులు అంటున్నారు.

ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములకు డిమాండ్ తగ్గిస్తూ వీలైనంత తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే భూములు ధర మరింత తగ్గే అవకాశాలు వున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సీలింగ్, అస్సైన్డ్ భూములకు పెరిగిన డిమాండ్

సీడ్ కాపిటల్ శంకుస్థాపన పనులు దగ్గర పడుతున్న కొద్దీ సీలింగ్, అస్సైన్డ్ భూములకు డిమాండ్ పెరుగుతుందని నిన్నా మొన్నటి వరకు ఎకరం రూ 20 లక్షల వరకు ఉన్న భూమల ధరలు నేడు 40 లక్షల వరకూ పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. దీనికి ప్రధాన కారణం సీలింగ్, అస్సైన్డ్ భూములకు ప్రభుత్వం కౌలు చెక్కులు పంపిణీ చేయడమేనని సమాచారం. ఏది ఏమైనా భూముల ధరలు సీడ్ కాపిటల్ శంకుస్థాపన అనంతరం మరింతగా పెరగవచ్చనే ఆశాభావాన్ని రాజధాని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.



## సచిన్ నోట.. స్వచ్ఛ పాట..


ఇదివరలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మల్ గ్రామాలుగా రూపొందించిన పథకాన్ని బీజేపీ స్వచ్ఛ భారత్‌గా ప్రజల్లోకి అత్యంత ప్రచారం కల్పించిన సంగతి తెలిసిందే... దేశ పరిశుభ్రతే ధ్యేయంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమానికి తన వంతు సాయంగా ప్రముఖ క్రికెట్ ఆటగాడు సచిన్ తన గళాన్నిచ్చారు. అంటే స్వచ్ఛ భారత్ ప్రచార గీతాన్ని పాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి తన వంతు సలహాలు, సూచనలు కూడా ఇచ్చారు. గాంధీ జయంతి రోజు విడుదలైన ఈ గీతానికి శంకర్ -ఎహసాన్ -లాయ్ సంగీతం అందించారు. ప్రసూన్ జోషి గీత రచయిత. ముఖేష్ భట్ గీత నిర్మాత.

## వాహన కొనుగోలుదారులకు శుభవార్త

రానున్న పండుగల సందర్భంగా నూతన వాహన కొనుగోలు దారులకు రుణసౌకర్యం అందించేందుకు స్కూటర్ ఇండియా లిమిటెడ్, హోండా మోటార్ సైకిల్‌తో ఆంధ్రా బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. వడ్డీరేటు 11.5 శాతం మాత్రమే ఉంటుంది. మహిళా కస్టమర్లకు వడ్డీశాతంలో మినహాయింపు ఉంటుందని బ్యాంకు తెలియచేసింది. వాహన విలువలో 85 శాతం గరిష్ఠంగా రుణం అందిస్తారు. కస్టమర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ రుణసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు వర్గాలు తెలియజేశాయి.

# పెళ్లయిన కొత్తలో...

కొత్తగా పెళ్లయిన వెన్నెల కోటి ఆశలతో కొత్తకాపురానికి వచ్చింది. హైదరాబాద్‌లో ఆమె భర్త బ్యాంక్ ఆఫీసర్, అందరూ ఆమె అదృష్టాన్ని పొగిడారు. అత్తామామలు వారి ఊర్లోనే ఉంటారు. కాబట్టి పండగలకు, పబ్బాలకు వెళ్లటం తప్ప వేరే బాదరబందీలు ఏమీ లేవు.. రోజూ ఆమె భర్త రామ్ ఉదయం 9 గంటలకు బయలుదేరి ఆఫీసుకు వెళతాడు. రాత్రి వచ్చేసరికి ఏడవుతుంది. ఉదయాన్నే లేచి వంటచేయడం వెన్నెలకు వచ్చిన ప్రమోషన్ .. వంట విషయంలో కూడా మరీ అంత పేచీకూడా ఉండదు. బావుంటే రామ్ ఒక ముద్ద ఎక్కువ తింటాడు... లేదంటే కాస్త తక్కువ తిండాడు....అయినా ...మొదట్లో బాగానే ఉండేదికాని, రోజూ గిన్నెలు తోముకోవడం, బట్లలుతకడం, వంట చేయడం అదే పని అలా చేస్తుంటే పనిమనిషిలా అయిపోయానేమిటి అనిపించసాగింది.... బోర్‌గా ఉంది. రెండు నెలలు గడిచేసరికి లైఫ్ రొటీన్‌గా అనిపించింది..... పెళ్లికాక ముందు అమ్మే అన్నీ చేసేది... చదువుకోవడం, టీవీ చూడటం, కాలేజీకెళ్లటం తప్ప పనేమీ ఉండేదికాదు. ఎప్పుడైనా బంధువులు మిత్రులువస్తే అతిధి మర్యాదలు చేయటం, అమ్మకు సాయపడటం తప్ప...ఎందుకో ఊహించినంత అందగా లేదనిపించింది.. సినిమాల్లో చూపినట్లు కూడా లేదే...ఫోన్ తీసి చిన్ననాటి ఫ్రెండ్ సుష్మకు ఫోన్ చేసింది. .. ఆవిషయం ఈ విషయం అయ్యింతరువాత మనస్సులోని అసంతృప్తిని బయటకు చెప్పింది. దాంతో నువ్వు చాలా అదృష్టరాలివని, పెద్దకుటుంబం కావడంతో పనులన్నీ చేసుకోవడంతోపాటు, పెద్దవాళ్లని చూసుకోవడం, వారిని ఆసుపత్రికి తీసుకెళటం ... పిల్లలను చూసు కోవడం వారిని చూసుకోవడం తనకు కష్టంగా ఉందని అయితే లైట్ తీసుకుంటే ఏమీ ఉండదని ఆమె చెప్పింది. అంతేకాకుండా ఆమె అత్తామామలు వంటలు గురించి రకరకాలుగా కామెంట్లు చేయడం, పనులు నేర్పిందెవరంటూ సూటిపోటీ మాటలంటా రంటూ, కష్టాలు ఏకరువు పెట్టింది...ఓహెూ...తనేనయమన్నమాట.. ఎందుకంటే సుష్మకు ఇంటర్‌లో ఉండగానే పెళ్లయ్యింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లల తల్లి కూడా...బహుశా తన పిల్లలను నర్సరీ స్కూళ్లకు తిప్పుతూ .. వంటచేస్తూ ... వాటిలోనే తన ఆనందాన్ని వెతుక్కుంటున్నట్లుంది అనుకుంది వెన్నెల ...అమ్మకు ఫోన్ చేసింది ... అదేమాట మళ్లీ చెప్పింది...మొదట్లో అలానే ఉంటుందనీ,.. అది నీ కుటుంబం .. నీపని..అనిఫీలయితే ఏ బాధా ఉండదని.. సినిమాకు ఒకవారం ..బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లివస్తుంటే కాస్తబెటరవుతావని ... ఊరడించింది.... ఈ సలహా నచ్చింది వెన్నెలకు... ఒక పూల మొక్కని మరోచోట నాటితే అక్కడిమట్టి, నీరు, గాలితో ఎడ్జెస్ట్ అవడానికి ఎంత సమయం తీసుకుంటుందో ..కొత్తగా పెళ్లయిన వాళ్లూ అంతే ...పెద్దలు కాస్త సలహా ఇచ్చి...భరోసాగా ముందుంటే అదేమంత సమస్యకాదు..... వారి భావిజీవితం మరొకరితో ముడిపడిఉందని గుర్తుచేస్తూ అక్కడికి అలవాటు పడేలా చేస్తే..నవదంపతుల జీవితాలు నందన వనమౌతాయి.



## ఆమె

### ఆడాళ్లూ ...మీ గుండె జాగ్రత్త

మన రాష్ట్రంలో 11 వేల మందికి ఒక వైద్యుడు ఉండటంతో మహిళలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ, సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోతున్నారు. భారత్ మహిళల్లో గుండెనాళాల వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. అయితే చాలా మందికి తమ గుండె పనితీరు సరిగా లేదని గుర్తించలేకపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల లేమి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అత్యంత ఖర్చుతో కూడినది కావడం కూడా ఈ పరిస్థితికి కారణం. మహిళల గుండె నాళాల సమస్యలను గుర్తించడం, చికిత్స జరపడంపై ఆసియాదేశాలు మరింత శ్రద్ధ తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. పట్టణ మహిళల్లో 61శాతం మంది గుండెజబ్బులకు లోనవుతున్నారు. బానపొట్ట, శరీరంలో అధిక నడుము భాగం ఉండటం, బాడీమాస్ ఇండెక్స్ ల్లో అసమానతలు గుండెనాళాల సమస్యకు దారితీస్తాయి. పల్లెల్లో కట్టెల వంటవల్ల పొగతో గుండె జబ్బుల బారిన పడుతున్నారని వంటనూనెల తయారీ సంస్థలు జరిపిన సర్వేలు తెలిపాయి. నగరజీవన విధానంలో చోటు చేసుకున్న అనేక మార్పులు కూడా 30-45 ఏళ్లమధ్య మహిళల్లో గుండె నాళాల సమస్యకు కారణమని కార్డియాలజిస్టులు చెబుతున్నారు. శారీరక శ్రమలేకపోవడం, ధూమపానం, ఆల్కహాల్, రక్తపోటు, ఊబకాయం, కొవ్వుశాతం అధికంగా ఉండే జున్ను, వెన్నలాంటి పదార్థాలు తీసుకోవడం, మధుమేహ వ్యాధి తదితర కారణాలతో మహిళలు ఎక్కువగా గుండెబ్బులకు గురవుతున్నారని డబ్లుహెచ్‌వో తెలిపింది. ఫాస్టు ఫుడ్, జంక్ ఫుడ్‌ల మాయాజాలంతో చిన్నారుల్లో కూడా ఈ సమస్య తలెత్తుతందని ఆరోగ్య శాఖ ఆందోళన చెందుతుంది. కాబట్టి మహిళలూ... తస్మాత్ జాగ్రత్త.

# ఫస్ట్ ట్వంటీ 20 హోరాహోరీ

**చేజింగ్‌లో సఫారీలు విజయం**

**పరుగుల సునామీ సృష్టించిన భారత్, దక్షిణాఫ్రికా**

**రోహిత్ శర్మ సెంచరీ వృథా**

**దక్షిణాఫ్రికా జట్టులో రాణించిన డివిలియర్స్**





ధర్మశాల : మహాత్మాగాంధీ- నెల్సన్ మండేలా సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల 2వ తేదీ జరిగిన 20 ట్వంటీ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. రెండు జట్లు హోరాహోరీగా విజయం కోసం పోరాడాయి. ఉత్కంఠంగా సాగిన ఈ మ్యాచ్‌లో సఫారీలు విజయం సాధించారు. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 199 పరుగుల చేసి ప్రత్యర్థి ఎదుట 200 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. అయితే సఫారీలు ఏమాత్రం తొణకకుండా మొదటి నుంచి దూకుడుగా ఆడారు. డివిలియర్స్ - ఆమ్లా జోడీ మంచి ప్రారంభాన్ని ఇచ్చారు. వేగంగా డివిలియర్స్ 31 బంతుల్లో అర్ధసెంచరీ సాధించి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. తరువాత వచ్చిన డుమినీ, బెహార్డిన్ నిదానంగా ఆడారు. 16వ ఓవర్‌లో అక్షర్ పటేల్ బౌలింగ్‌లో డుమిని వరుసగా మూడు సిక్సర్‌లను కొట్టడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. వీరిద్దరు 44 పరుగులను జోడించడంతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టులో ఓపెనర్ రోహిత్ శర్మ విశ్వరూపం చూపించి టీ 20లో తొలి సెంచరీ సాధించాడు. విరాట్ కోహ్లి కూడా మంచి స్కోరు సాధించాడు. మొత్తానికి ఈ మ్యాచ్ ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచింది. మిగిలిన టీ 20 మ్యాచ్‌లో ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో భారత్ జట్టు ఉంది.

***గాంధీ - మండేలా నాణెం*** : గాంధీ-మండేలా సిరీస్ మ్యాచ్‌లలో టాస్ వేసేందుకు బీసీసీఐ వీరిద్దరి బొమ్మలతో ప్రత్యేక నాణెం తయారు చేయించింది. బంగారు పూత కలిగిన ఈ వెండి నాణేన్ని ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లకు టాస్ వేయడానికి ఉపయోగిస్తారు. 2వ తేదీ ధర్మశాలలో జరిగిన టి 20 మ్యాచ్‌లో దీనిని వినియోగించారు. ఇందులో బొమ్మ వైపు గాంధీ, మండేలా చిత్రాలు ఉండగా, బొరుసువైపు ఫ్రీడం సిరీస్ అని రాసి ఉంటుంది.

## టెన్నిస్‌లో సానియా- హింగిస్ సంచలనాలు..



**ఆర్‌వి, రాజధాని ప్రతినిధి :** ఒకప్పుడు టెన్నిస్ ప్రపంచంలోని చాలా తక్కువ దేశాలకే పరిమితమైన క్రీడగా భావించే పరిస్థితి ఉండేది. భారత్‌లో క్రికెట్ నీడలో మరే ఆటకూ అంత ప్రాముఖ్యత లభించేది కాదు. కానీ ఇటీవల టెన్నిస్‌లో కూడా భారత క్రీడాకారులు దుమ్ము దులిపేస్తున్నారు. తెలుగు యువతి సానియా మీర్జా సంచలనాలతో భారత్‌లో యువత టెన్నిస్‌పై అభిమానం పెరుగుతోంది. సానియా ఇటీవల కాలంలో స్విస్ క్రీడాకారిణి మార్టినా హింగిస్‌తో కలసి ఉమెన్ డబుల్స్‌లో వరుసగా టైటిళ్లను కైవసం చేసుకుంటోంది. ప్రస్తుతం చైనాలోని వుహాన్ డబ్ల్యుటిఏ ఉమెన్ డబుల్స్‌లో ఈ జోడీ సెమీఫైనల్‌కు చేరింది. మరోవైపు హింగిస్‌తో మిక్స్‌డ్ డబుల్స్‌లో జతకట్టిన లియాండర్‌పేస్ కూడా విజయాలను సాధిస్తున్నాడు.






## 150వ సినిమా 'కత్తి'

చిరంజీవి 150వ సినిమా రడీగా ఉందని టాలీవుడ్ టాక్..తమిళ,తెలుగు నటుడు విజయ్ నటించిన కత్తి సినిమాను రీమేక్ చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సినిమా మాతృకకు మురుగుదాసన్ దర్శకత్వం వహించారు. అయితే తెలుగులో వినాయక్ దర్శకత్వం వహించినా స్క్రీన్‌ప్లే మురుగుదాస్ అందిస్తారు. ఈ సినిమా రాజకీయంగాను, సినిమాపరంగాను చిరంజీవికి ప్లస్ అవుతుందని ఒప్పుకున్నారంటున్నారు. సినిమా సక్సెస్‌తో రాజకీయ రంగంలో మళ్లీ పుంజుకుంటారని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. సినిమా రంగంలో ఆచితూచి వ్యవహరించి తన కేరీర్‌కు ప్లస్ అవుతుందనుకున్న సినిమాను ఎన్నుకున్నారని టాలీవుడ్ కథనం. ఈ సినిమా సామాజిక అంశాలయిన , కార్పొరేట్ సంస్థల దురాక్రమణలో భూసేకరణతో ఉపాధి కోల్పోయి దిక్కుతోచని రైతులు ఆత్మహత్యలు నేపథ్యంలో జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇవి కరెంట్ ఎఫైర్స్ కాబట్టి సక్సెస్ అవుతుందని నమ్మకంతో ఉన్నారు. స్టాలిన్ సినిమాతో మెసేజ్ ఇచ్చిన వినాయక్ ఈసినిమాతో మళ్లీ హిట్ కొట్టాలన్న ఆత్రుతతో ఉన్నారు. ఈ కథలో విజయ్ ద్విపాత్రాభినయం చేశారు. ఒకటి జీవానందం-కదిరేష్ డ్యూయల్‌రోల్స్ (హీరో) రైతుల కోసం పోరాడే ప్రగతిశీలవాది జీవానందంకాగా మరొకటి అల్లరి చిల్లరిగా తిరిగే ఖైదీ కదిరేషన్, అలియాస్ కత్తిగా విజయ్ తమిళంలో నటించారు. అనుకోని పరిస్థితుల్లో ఒకరికొకరు తారసపడతారు. జీవానందం గా కత్తి వెళతాడు దుష్టరాజకీయ నాయకుల మెడలు వంచుతాడు.

## అమెరికాలో రుద్రమదేవి

భారత దేశంలో మొదటి చారిత్రాత్మక స్టీరియోస్కోపీ సినిమా రుద్రమదేవి 3డి, 2 డి లతో అక్టోబరు 9న విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమాను 160 థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంచారు. రాణి రుద్రమ దేవి తన తండ్రి తరువాత 14 ఏళ్లకే కాకతీయ సామ్రాజ్య సింహాసనం అధిష్టించింది. ఈ చరిత్ర 1260 శతాబ్ధంలోది. రాణి రుద్రమదేవిగా అనుష్క షెట్టి నటించగా మరో ముఖ్యపాత్ర గోన గంగారెడ్డిగా అల్లు అర్జున్ నటించారు. సినిమాలో ఈ పాత్ర హైలెట్‌గా ఉంటుందని భావిస్తున్నారు. సీనియర్ నటుడు కృష్ణంరాజు, ప్రకాష్‌రాజ్, సుమన్, అజయ్, సింగర్ బాబాసెహగల్, నిత్యామీనన్, క్యాథరిన్ థెరెస్సా, హంసానందిని నటిస్తున్నారు. చివరి 30 నిమిషాల క్లైమాక్స్ అత్యధికంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని భావిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతాన్ని అందించిన ఇళయరాజా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, మిక్సింగ్‌లను లండన్‌లో నిర్వహించారు.

## త్రిపుర



స్వాతి, నవీన్ చంద్ర జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ ను రాజ్‌కిరణ్ దర్శకత్వం వహించగా, చిన్నబాబు, రాజశేఖర్ సంగీతం కమ్రీన్, స్క్రీన్‌ప్లే దర్శకత్వం కోనవెంకట్ . ఈ సినిమాలో రావ్‌రమేష్ ప్రతినాయకుడిగా నటించారు.

## ఆస్కార్ ఎంపికకు 'కోర్టు'




డైరెక్టర్‌తో సహా అందరూ కొత్తవారితో రూపొందించిన చిత్రం 'కోర్టు' డైరెక్టర్ చైతన్య తమన్నా ఎప్పుడూ సినిమా చేస్తాననుకోలేదు. ఎందుకంటే అతను సినిమాలు కూడా తక్కువగా చూస్తారు. కాని భారత్‌లోని న్యాయవ్యవస్థను చూసిన తరువాత అతనికి ఒక సినిమా చేయాలనిపించిందట...

వయస్సు మళ్లిన సంఘ కార్యకర్త తన జానపద గేయాలతో ప్రజల్లో చైతన్యం నింపుతుంటారు. పారిశుద్ధ్య పనిచేసుకునే మహిళ ఆత్మహత్యకు కారణం నువ్వే అంటూ పోలీసులు ఒకరోజు సంఘకార్యకర్తను అరెస్టు చేస్తారు. కోర్టులో భారత శిక్షాస్మృతిపై వాదోపవాదాలను ఇందులో కళ్లకు కట్టినట్టు చూపించారు. అసలు మానవీయ కోణంలేని అలవాటుగా ఇరువర్గాల లాయర్లు చేసుకునే సాదాసీదా వాదనలు, మిస్ అయ్యిన డాక్యుమెంట్లు, పడికట్టు పదాలు, ఆరోపత్ర్యారోపణలు, సమాజం డైరెక్టర్ చైతన్య తమన్నా స్క్రీన్ ప్లే రాసుకున్నారు. వివేక్ గోబర్ సమర్పించిన ఈ చిత్రంలో వీర్ సతీదార్, వివేక్ గోంబర్, గీతాంజలి కులకర్ణి, ప్రదీప్ జోషి , ఉషాచానే, శిరీష్ పవార్ నటీనటులుగా ఉన్నారు. సంగీతం సంభాజీ భగత్, సినిమాటోగ్రఫీ మృణాల్ దేశాయ్, ఈ సినిమా నిడివి 116 నిమిషాలు ఉంటుంది. మరాఠీ, హిందీ, గుజరాత్ , ఇంగ్లీషు భాషల్లో ఈ సినిమా నిర్మించారు. నటించిన వారెవ్వరూ వృత్తిరీత్యా నటులు కాదు. బ్యాంకు ఉద్యోగులు, టీచర్లు , గవర్నమెంట్ ఉద్యోగులు. న్యాయవ్యవస్థపై దర్శకుడు ఇంటర్వ్యూలు, నోట్సు, వీడియోలు, బొమ్మలతో సుదీర్ఘ అధ్యయనం చేశారు. ఆరునెలల సమయాన్ని కాస్టింగ్ కోసం మరో 8 నెలలు లొకేషన్ కోసం వెచ్చించారు. ఈ సినిమా పూర్తవడానికి 3 సంవత్సరాల సమయం పట్టింది. ఈ సినిమాకు 2014లో 71వ వెనిస్ అంతర్జాతీయ ఫిలిం పెస్టివల్‌లో బెస్ట్ ఫిలిం అవార్డు, (అర్రిజెట్ట) 16వ ముంబై ఫిలిం ఫెస్టివల్ లో అంతర్జాతీయ పోటీలో ప్రథమ బహుమతి, వియన్నాలో జరిగిన అంతర్జాతీయ ఫిలిం పెస్టివల్‌లో అవార్డు, హాంకాంగ్, సింగపూర్ అవార్డులతో ఈ సినిమా ముందుంది. ఉత్తమ దర్శకుల విభాగంలో అంతర్జాతీయ అవార్డులను కూడా కోర్టు కైవసం చేసుకుంది. ఆస్కార్ అవార్డుకు ఈ సినిమాను భారత్ ప్రభుత్వం ఎంపిక చేయడం పట్ల బాలీవుడ్‌తో సహా సినిప్రముఖులందరూ హర్షం వెలిబుచ్చారు. అయితే యువతరం బలహీనతల పైనా లేదంటే రాజులు-రాజ్యాలు కాదు కూడదంటే దయ్యాల సినిమాల పై సినిమాలు రూపొందించే వారంతా ఇప్పటికైనా సమాజానికి మంచి సందేశంతో పాటు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే సినిమాలు రూపొందిస్తారని కోరుకుందాం.

## కన్నుల పండువగా 'బ్రూస్‌లీ' ఆడియో విడుదల

'బ్రూస్‌లీ' చిత్రం పాటల ఆడియోను భారీ సంఖ్యలో హాజరయిన అభిమానుల మధ్య శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల చేశారు. ముఖ్యఅతిథిగా చిరంజీవి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రామ్‌చరణ్, రకుల్ ప్రీత్‌సింగ్ కథానాయకులుగా ఈ చిత్రంలో నటించారు. ఈ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ ఏడేళ్ల తరువాత కెమేరా ముందుకు రావడం ఎంతో ఉద్వేగానికి గురిచేసిందని, ఈ చిత్రంలో అతిథి పాత్రలో నటించానన్నారు. 'నా స్టామినాకీ నా స్పీడుకి ఫ్యూయల్ అభిమానులే ' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌ను దర్శకుడు వైట్ల నాతో చెప్పించారన్నారు. చిన్నతనం నుండి తనకు బ్రూస్‌లీ అంటే అభిమానమని, చరణ్ దీనిలో నటించడం ఆయన అదృష్టమని తెలిపారు. దర్శకుడు నాయక్ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. రాంచరణ్ ఆప్‌ను చిరంజీవి సతీమణి సురేఖ విడుదల చేశారు. అక్క, తమ్ముడు మధ్య సాగే కథ ఇదని, అక్కగా కృతికర్బందా నటించారని నిర్మాత డీవీ వీ దానయ్య తెలిపారు. ఈ చిత్రానికి శ్రీను వైట్ల దర్శకత్వం వహించారు. కోనవెంకట్ , గోపీ మోహన్, మాటలు రాశారు. తమన్ తనకు నాలుగు పాటలు ఇచ్చారన్నారు. సినిమాలోని పాటలు, అన్నివిధాలుగా సంతృప్తిని ఇచ్చాయన్నారు. బాణీలకు తగిన విధంగా సన్నివేశాలు తోడయ్యాయని తమన్ అన్నారు. చిరంజీవిగారితో తొలి షాట్ తీసినప్పుడు 'నా గుండెల్లో వంద గుర్రాలు పరిగెడుతున్నాయనిపించిందని' రకుల్ ప్రీత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాసన, శ్రీజ,సురేఖ, నదియా, కృతి కర్బందా, టిస్కాచోప్రా, డా. వెంకటేశ్వరరావు, ఎన్వీ ప్రసాద్ కోనవెంకట్, భోగపల్లి ప్రసాద్, జెమినీ కిరణ్, విజయ్, మనోజ్ పరమహంస, గోపీమోహన్, సంపత్, రామజోగయ్య శాస్త్రి, జానీ, ముఖేష్‌రుషి పాల్గొన్నారు.



నవ్యాంధ్రరాజధాని ప్రజలకు, 'రాజధానివార్తలు' వారపత్రిక ప్రారంభోత్సవ శుభాకాంక్షలు



ఉంగరాల బడే మియా



ఉంగరాల ఖాజ
ఖాజ
సెల్ నెం: 9441275466
8897017411

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, వారపత్రిక
రాజధాని వార్తలు

ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్

వివాహాది శుభకార్యాలకు కావలసిన అన్నీ రకముల సామానులు సప్లై చేయబడును కాటరింగ్ మా ప్రత్యేకత.

చిరునామా: ఎంపీపీ స్కూల్,వాటర్ టాంక్ వద్ద, రాయపూడి పోస్ట్,తుళ్ళూరు మండలం, గుంటూరు జిల్లా

Editor-in-Chief : Pattan H Khan, Printed, Published and owned by him, APTEL14598. Printed at Jagathi Publications Ltd., D.No. 5-625, Vadlamudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist., A.P.
Cell : 94406 62699, email : rv@rajadhanivartalu.com